క్లుప్తంగా

ఈ-ఆశ యాప్‌పై అవగాహన



ఈ-ఆశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఈఓ రవికుమార్

పోలాకి: క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తల పనితీరును పర్యవేక్షించే ఈ-ఆశ యాప్‌పై బుధవారం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆశ కార్యకర్తల విధులు ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో వినూత్నమైన యాప్ రూపుదిద్దుకుంది. దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారిని ట్రాక్ చేయటం, అర్హులైన వివిధ ఆరోగ్య సంక్షేమ పథకాల లబ్ధిదారులను రెగ్యులర్ ఫాలోయింగ్ అమలు చేయటం వంటివి ఈ యాప్ ద్వారా సాధ్యమవుతాయి. వైద్యాధికారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు



రక్త నమూనా పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది

బూర్జ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలను ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖవారు బుధవారం నిర్వహించారు. రుధిర సౌజన్యంతో హిమో గ్లోబిన్, బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు వల్ల అత్యవసర పరిస్థితిలో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల అధ్యాపకులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా-వంశధార పర్యటన బూటకం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: రాష్ట్రంలో మాజీ సీఎం చంద్రబాబు తలపెట్టనున్న పెన్నా - వంశధార పర్యటన కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని వైఎస్సార్ సీపీ నాయకులు లోతుగెడ్డ తిరుపతిరావు, వనుము లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వంశధార నిర్వాసితులకు ముంపు గ్రామల నుంచి పోలీసులతో నిర్ధాక్షిణ్యంగా నెట్టేసిన చంద్రాబాబు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ నేడు ప్రాజెక్టుల పేరుతో పర్యటన చేయడం సిగ్గుచేటన్నారు. నిర్వాసితుల ప్యాకేజీలు, పలు రకాల నష్టపరిహారాలను అప్పటిలో టీడీపీ నేతలు దోచుకున్నారన్నారు. నేడు నిర్వాసితులపై చంద్రబాబు కపట ప్రేమ కురిపిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి వంశధార నిర్వాసితులకు అదనపు ప్యాకేజీ కింద రూ.267 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో 219 కోట్లు నిర్వాసితులకు పంపిణీ చేశారన్నారు. మిగిలిన రూ.48 కోట్లు త్వరలో సీఎం జగన్ మంజూరు చేస్తారన్నారు. చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే కలమట పర్యటను తిప్పికొట్టాలని నిర్వాసితులకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి



ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వినతిపత్రం అందజేస్తున్న ఆఫ్‌షోర్ నిర్వాసితులు

పాతపట్నం: మెళియాపుట్టి మండలం చీపురుపల్లి, దానుపురం గ్రామాలకు చెందిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని చీపురుపల్లి గ్రామ సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, పిట్ట సవరయ్య, గరికి లింగయ్య, కారంగి జనార్దనరావు, నిర్వాసితులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులు మాట్లాడుతూ మహేంద్రతనయ నదిపై నిర్మాణం చేపడుతున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌లో పడిన గ్రామాలకు చెందిన అర్హత ఉన్న నిర్వాసితులకు న్యాయం చేయాలని విన్నవించారు. అర్హత ఉండి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాని వారు ఉన్నారని, చీపురుపల్లి పంచాయతీలో దేవాలయాలు, చర్చిలకు నష్ట పరిహారం, స్థలాలు కేటాయించాలన్నారు. పట్టాలు అందజేయాలని, డీ పట్టాలు ఉన్న రైతులకు నష్టపరిహారం అందజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గరికి సోమేశ్వరరావు, పానిల త్రినాథరావు, గుమ్ముడు కుమార్, పి.శంకరరావు తదితరులున్నారు.

నేడు స్పీకర్ పర్యటన

ఆమదాలవలస రూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటిస్తున్నట్లు స్పీకర్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొగరాం గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో ఉదయం 10.30 గంటలకు పాల్గొంటారు. పొన్నాంపేటలో మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు. ఈ మేరకు ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన పౌష్టికాహార కిట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం అందజేశారు. చిన్నారులు, బాలింతల్లో రక్తహీనతను, పోషకాహారలోపాన్ని నివారించడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమన్నారు. బియ్యం 3 కేజీలు, పప్పు 1 కేజీ, ఆయిల్ అర కేజీ, గుడ్లు 25, పాలు 5 లీటర్లు, రాగిపిండి 2 కేజీలు, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, చెక్కి 250 గ్రాములు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: పట్టణంలో కిట్లు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



హిరమండలం: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కిట్లు పింపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



బూర్జ: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కిట్లు అందజేస్తున్న అధి కారులు, ప్రజాప్రతినిధులు



పొందూరు: కిట్లును ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు



నరసన్నపేట: పురుషోత్తంనగర్ కాలనీలో కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడపగడపతో ప్రజాసమస్యలు పరిష్కారం
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ఆమదాలవలస రూరల్: రామచంద్రాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ఆమదాలవలస రూరల్: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని అక్కడే పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రామచంద్రాపురం, ఆనందపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమం అందుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో ఎంతో మేలు చేసిందన్నారు. అర్హత ఉండి పథకం పొందని లబ్ధిదారులు ఉంటే నేరుగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న రోజుల్లోనూ ప్రజలంతా ఆదరించాలని కోరారు. సర్పంచ్ చల్లా ఉష, ఎంపీటీసీ కొల్లి యమున, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చల్లా సింహాచలం, మాజీ ఎంపీటీసీ రౌతు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మండల నారాయణరావు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఏఓ మెట్ట మోహనరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రమౌళి, ఇన్‌చార్జి ఏపీఓ రాము, పంచాయతీ కార్యదర్శి పి.రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారాలు నమ్మ వద్దు..

నరసన్నపేట: టీడీపీ నాయకుల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మి మోసపోవద్దని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి అయితేనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని, పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మేజరు పంచాయతీ నరసన్నపేటలోని పెద్దపేట, నెయ్యిలవీధితో పరిసర వీధుల్లో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకొని, వారు పొందిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ నాలుగేళ్లలో ప్రతి ఇంటికీ ఎంత మొత్త లబ్ధి జరిగిందో వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో టీడీపీకి రెండు మార్లు ఇలానే నమ్మి అధికారం ఇస్తే పదవి వచ్చాక ఎలా ప్రజలకు మోసం చేశారో అందరికీ తెలిసిందేనన్నారు. నరసన్నపేట పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎవరూ అపోహలకు పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీడీఓ బి.మధుసూదనరావు, పార్టీ నాయకులు పి.కృష్ణప్రసాద్, కేసీహెచ్‌బీ గుప్త, చీపురు కృష్ణ, పాగోటి రాజారావు, ముద్దాడ అప్పలనాయుడు, పతివాడ గిరీశ్వరరావు, బొబ్బాది ఈశ్వరరావు, సైలజ, రమణ సాహు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బండి వీధిలో..

నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలోని బండి వీధితోపాటు పరసర వీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు.

ఆయుష్మాన్ ఐడీ ప్రతి ఒక్కరికీ ఉండాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

నరసన్నపేట: కుటుంబంలో ఉన్న అందరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్‌ఏ-అబా) సృష్టించాలని, దీంట్లో అలసత్వం వద్దని డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి అన్నారు. మండలంలోని బొరిగివలసలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రాంను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రాం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ప్రతి ఒక్కరికీ సృష్టించాలని సూచించారు. దీని ద్వారా వారి ఆరోగ్య వివరాలు అకౌంట్లో ఉంటాయన్నారు. అలాగే ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గుప్పెడిపేట పీహెచ్‌సీ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బాగా జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ శ్రీనాథ్, పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

సరుబుజ్జిలి: మొక్కలు అధికంగా నాటి వాటిని సంరక్షించడం ద్వారా ప్రకృతిని కాపాడవచ్చునని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీడీ జి.వి.చిట్టిరాజు తెలిపారు. మండలంలోని రొట్టవలస పంచాయతీ అవతరాబాద్‌గ్రామంలో అమృత్ సరోవర్ పథకంలో పనులు చేసిన చెరువు గట్టుపై బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి పనుల్లో నాణ్యతకు పెద్దపీటవేయాలని సూచించారు. జాబ్‌కార్డుదారులందరికీ పని కల్పించాలనిన్నారు. వర్షంనీరు వృథాగా పోకుండా భూగర్భంలో ఇంకే విధంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. స్థానిక సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, ఏపీడీ రాధ, ఏపీఓ పార్వతి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: రైతు సంక్షేమమే సీఎం వైస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని కొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్‌గా వరుసుగా నాలుగోసారి బుధవారం బాధ్యతలు చేపట్టి ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్‌లుగా కుంచాల నూకరాజు, గార రాజులునాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత రైతులకు న్యాయం జరిగేలా పీఏసీఎస్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో కొత్తూరు సొసైటీని లాభాల బాటలో నడిపిస్తున్నామన్నారు. జిల్లాలో 49 సొసైటీలు ఉండగా అందులో కొత్తూర సొసైటీ జిల్లాలో రెండో స్థానంలో ఉందన్నారు. సంఘం సీఈఓ కృష్ణారావు వైఎస్సార్‌సీపీ నాయకుడు లోతుగెడ్డ తిరుపతిరావు, సర్పంచ్ వై.ధర్మారావు, సాధుబాబు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, బూర్లె శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, పంకజదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందిస్తాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



నందివాడలో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని నందివాడ, వావిలపల్లిపేట, నరసాపురం గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంకుల నిర్మాణానికి, ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. వావిలపల్లిపేటలో రూ.54 లక్షలతో, నందివాడలో రూ.75 లక్షలతో, నరసాపురంలో రూ.69 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, గాడు నాగరాజు, వండాన వెంకటరావు, కొంచాడ గిరిబాబు, మజ్జి శైలజ తదితరులు పాల్గొన్నారు.

బుడితి పీఏసీఎస్ చైర్మన్‌గా సన్యాసిరావు

సారవకోట: మండలంలోని బుడితి పీఏసీఎస్ చైర్మన్‌గా ఆ గ్రామానికి చెందిన మెండ సన్యాసిరావును నియమిస్తూ సంబంధిత అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా గేదెల బాలకృష్ణారావు నాయుడు, మెండ సుందరరావును నియమించారు.

పింగళి వెంకయ్య ఆదర్శప్రాయుడు



పాతపట్నం: పింగళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



సారవకోట: వెంకయ్య చిత్రపటానికి నివాళుర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పింగళి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధారాణి మాట్లాడుతూ.. జాతీయ పతాకాన్ని మన ఆంధ్ర ప్రాంతానికి చెందిన పింగళి వెంకన్న రూపొందిండం ఆనందకరమన్నారు. ఉపాధ్యాయులు అన్నపూర్ణ, జయమ్మ, రేణుక, లక్ష్మి, హరికుమారి, అమరావతి, స్వాతి, సుగుణావళి, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండా రూపకర్తకు ఘన నివాళి

సారవకోట: మన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని అవలింగి జేబీటీ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పింగళి చిత్ర పటానికి నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సిబ్బందికి సూచనలిన్న పర్యవేక్షకుడు చిన్నరాజులు

జలుమూరు: సీజనల్ వ్యాధులపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ పర్యవేక్షకుడు చిన్నరాజులు అన్నారు. చల్లవానిపేట, లింగాలవలస గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు బుధవారం వ్యాక్సిన్‌లు వేసి సిబ్బందితో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఆరోగ్య కార్యకర్తలు మోహిని, సంతోషి, అమ్మలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస రూరల్: మండలంలోని కొత్తరోడ్డు వద్ద ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్పిడి చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు సబ్‌స్టేషన్ పరిధిలో గల కొత్తరోడ్డు, గోపీనగర్, తోటాడ, అక్కివరం, మహసాహెబ్‌పేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నాడు–నేడు పనులు సకాలంలో పూర్తిచేయాలి

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులు సకాలంలో పూర్తిచేయాలని నరసన్నపేట ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు హెచ్‌ఎంలకు, స్కూల్ కమిటీ ప్రతినిధులకు సూచించారు. స్థానిక భవిత భవనం వద్ద స్కూళ్లలో జరుగుతున్న నాడు–నేడు పనులపై బుధవారం సమీక్ష నిర్వహించారు. మండలంలో 33 స్కూళ్లలో నాడు–నేడు పనులు జరుగుతున్నాయన్నారు. వీలున్నంత తొందరగా పనులు పూర్తి చేయాలని, చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. స్కూళ్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఏఈ చంద్రమౌళి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

31 లోగా నివేదిక ఇవ్వండి

జలుమూరు: చిన్నదూగాం పంచాయతీ పరిధి కాకర్ల చెరువులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వ్యవసాయనికి అనుమతి ఇవ్వడంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఎన్‌జీటీ కోరినట్లు సుప్రీం కోర్టు న్యాయవాది డి.వి.రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ధిక్కరించి చెరువులో ఎంపీ నిధులతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశారని, వ్యవసాయానికి అనుమతించారని గరీబ్ గైడ్ సంస్థ మెమో దాఖలు చేసిందన్నారు. దీనిపై విచారించిన ఎన్‌జీటీ ఈ నెల 31న లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించిందన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం పదవీ కాలం పొడిగింపు

హిరమండలం: హిరమండలం పీఏసీఎస్ పాలకవర్గం పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించినట్లు పీఏసీఎస్ సీఈఓ ఎల్.మోహన్‌రావు బుధవారం తెలిపారు. చైర్మన్‌గా ఏవీ సురేష్, సభ్యులుగా అల్లు శంకర్‌రావు, అంగూరు భాస్కరావును నియమించారన్నారు. పాలకవర్గం 2024 జనవరి 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు, కాలువ గట్లు, రోడ్డు పక్కన, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, రైతుల పొలాల్లోనూ నాటిన ప్రతీ మొక్కను బతికించే బాధ్యత మనందరిపైన ఉందని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని సిద్ధాంతం అమృత సరోవర్ చెరువు గట్టుపైన, పెద్దకొల్లివలస సామాజిక భవనం వద్ద బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, డ్వామా ఏపీడీ పంచాది రాధ, పెద్దకొల్లివలస, సిద్ధాంతం సర్పంచ్‌లు రావాడ రాజేశ్వరి, గాది కోటేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

జలుమూరు: అర్హత కలిగిన ప్రతీ పేదవాడికి ఇళ్లతోపాటు సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందని ఎంపీపీ వాన గోపి అన్నారు. బుధవారం శ్రీముఖలింగం, సుబ్రహ్మణ్యపురం గ్రామాలలో గృహ నిర్మాణ శాఖ డీఈఈతో కలిసి పర్యటించారు. ఇటీవల జగనన్న సురక్షలో వచ్చిన వినతులను పూర్తిస్థాయి పరిశీలన జరుగుతోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. శ్రీముఖలింగం సర్పంచ్ టి.సతీష్ ఎంపీటీసీ కె.హరిప్రసాద్, ఏఈ గోపికృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

బూర్జ: మండలంలోని కొల్లివలస కేజీబీవీ నుంచి ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైనట్లు స్థానిక ఎస్‌ఐ బి.అశోక్‌బాబు బుధవారం రాత్రి తెలియజేశారు. బైపీసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు రాత్రి భోజనం చేసిన తర్వాత కనిపించలేదని వార్డెన్, బోటనీ అధ్యాపకురాలు లావణ్య ఫిర్యాదు అందజేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.